# ఇటీవలి పంజాబ్ కిసాన్ ఉద్యమంపై నివేదిక

**ఏప్రిల్** నెలలో సంయుక్త్ కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం. )కు అనుబంధంగా ఉన్న పంజాబ్‌కు చెందిన 22 రైతుసంఘాలు, పంజాబ్ ప్రజల దీర్ఘకాలిక, అత్యంత కీలకమైన సమస్యల కోసం, డిమాండ్ల కోసం పోరాడాలని నిర్ణయించుకున్నాయి. వారు 13 డిమాండ్ల జాబితాను తయారు చేసి, పంజాబ్ ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. అతను దానిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. మళ్ళీ ఏప్రిల్ చివరిలో వారు మరొక రౌండ్ చర్చలు జరిపారు. ఇవి చాలా నిరాశపరిచాయి. ఎందుకంటే ప్రభుత్వం వీటి పట్ల చాలా ప్రతికూల వైఖరిని ప్రదర్శించింది.

కాబట్టి, రైతుసంఘాలు 2022 మే 17 నుండి చండీగఢ్‌లో ఆందోళన మరియు నిరవధిక ధర్నాను ప్రారంభించాలని నిర్ణయించాయి. సన్నాహాలు చేసి, వారు రైతులలో గొప్ప ఉత్సాహాన్ని నింపారు. ఎస్‌కెఎం విధానాన్ని ఉల్లంఘించి ఎన్నికలలో పాల్గొన్న అన్ని యూనియన్లు నిశ్శబ్ద ప్రేక్షకులుగా మిగిలిపోయాయని ఇక్కడ గమనించాలి. అయినప్పటికీ వారిలో చాలామంది విడిపోవడం గాని, వారి కార్యకర్తలు ఇతర ఎస్‌కెఎం అనుబంధ సంస్థల్లో గాని చేరారు లేదా కొందరు తమకు తాముగా ఎస్‌కెఎంతో అనుబంధంగా కలిసారు.

నిర్ణయించిన ప్రకారం, సుమారు 2000 మంది రైతులు తమ ట్రాక్టర్ ట్రాలీలపై 4 నెలల పాటు రేషన్, పరుపులు, ఫ్యాన్లు, కూలర్లు, ఫ్రిజ్‌లతో మే 17 ఉదయం చండీగఢ్ సరిహద్దులోని మొహాలీకి చేరుకున్నారు. వారు మొహాలీలోని గురుద్వారా అంబ్ సాహిబ్ వద్ద సమావేశమై, దాదాపు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న చండీగఢ్ వైపు కదిలారు. పంజాబ్ పరిధిలోని దారిలో రెండు చోట్ల పలు దొంతర్లగా బారికేడ్లను, టిప్పర్లను నిలిపారు. పక్కన చండీగఢ్ పోలీసులు రైతులను నిలువరించడానికి 5 చోట్ల బారికేడ్లను ఏర్పాటు చేశారు. మొదట బారికేడ్ వద్ద రైతులు ఘర్షణ పడ్డారు. చివరకు వారు దాన్ని ఛేదించడంలో విజయం సాధించారు. బాష్పవాయువు, నీటి ఫిరంగులతో పాటు, పోలీసులు, కమాండోలను భారీగా మోహరించారు. ముందుకు సాగే క్రమంలో అక్కడ మరో కంచెని ఏర్పాటు చేశారు. ఈ సమయంలో సీనియర్ పోలీసు అధికారి చేతులు జోడించి రైతులను ముందుకు వెళ్ళవద్దని అభ్యర్థించారు. ఎందుకంటే సిఎం మర్నాడు వారితో సమావేశానికి పిలుపునిచ్చారు. అయితే రైతులు వెనక్కి వెళ్లకూడదని నిర్ణయించుకుని అక్కడే ధర్నాకు దిగారు. మర్నాడు సమావేశం నిర్వహించి తమ డిమాండ్లను నెరవేర్చకుంటే అక్కడే నిరవధిక ధర్నా చేపడతామని, మరో బోర్డర్ సింఘుకు మారతామని ప్రకటించారు. వారు రాత్రి ఆరుబయట గడిపారు. మండుతున్న వేడిని తట్టుకోవడానికి మొహాలీకి చెందిన ప్రజలు వారికి లస్సీ, జల్జీరా, చల్లని నీరు మరియు ఇతర పానీయాలు పంచారు.

మే 18వ తేదీ ఉదయం ఎస్‌కెఎం పంజాబ్ నేతలతో సీఎం 3 గంటలపాటు సమావేశం నిర్వహించారు.

**సి.ఎం.తో చర్చల తర్వాత ఆమోదం పొందిన డిమాండ్స్ ఇవి :**

- పెసలు, మొక్కజొన్న మరియు బాస్మతిలకు ప్రభుత్వం కనీస మద్దతు ధరను ప్రకటించాలి.
  ప్రభుత్వం అంగీకరించి, అదే రోజు నోటిఫికేషన్ జారీ చేసింది, తరువాత కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించింది. పెసలుకు కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7275గా ప్రకటించింది.
- ఎండాకాలం ప్రారంభం కావడం వల్ల వేడి కారణంగా దిగుబడి 30% పడిపోవడంతో రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున పరిహారం చెల్లించాలి.
  ఈ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని సిఎం హామీ ఇచ్చారు.
- చిప్‌తో ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటును ఆపివేయాలి.
  దానికి సీఎం అంగీకరించారు.
- కండి ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో స్థిరపడిన రైతుల గెంటివేతను ఆపాలి (చాలా కాలం క్రితం కండి ప్రాంతానికి చెందిన సన్నకారు రైతులు - శివాలిక్ శ్రేణుల దిగువన ఉన్న గురుదాస్‌పూర్, హోషియార్‌పూర్, రోపార్ మరియు ఫతేఘర్ సాహిబ్ జిల్లాల్లోని పాక్షిక కొండ ప్రాంతాలలో 161 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ప్రాంతంలో సాగు చేయలేని ప్రభుత్వ భూమి - ప్రభుత్వంచే ప్రోత్సహించబడి, దానిని సాగు చేయదగినదిగా చేసింది, ఇప్పుడు వారు తరతరాలుగా దానిపై స్థిరపడ్డారు, కాని ప్రభుత్వం వారికి ఇంకా చట్టపరమైన హక్కులను ఇవ్వలేదు. వివిధ ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు వాగ్దానం చేసినప్పటికీ ప్రభుత్వం వారికి ఇంకా చట్ట పరమైన హక్కులు ఇవ్వలేదు.) తొలగింపు ఉత్తర్వులను నిలిపివేయాలని మరియు ఈ భూమిని దున్నే వారికి బదిలీ చేయాలని రైతులు కోరుతున్నారు.
  సీఎం అంగీకరించారు మరియు మే 23న పంచాయతీ శాఖ మంత్రితో సమావేశమై విధివిధానాల రూపకల్పనకు నిర్ణయించారు.
- భాక్రా బియాస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ (బిబిఎంబి) నుండి పంజాబ్ మరియు హర్యానా శాశ్వత సభ్యులను తొలగించే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరాలని రైతులు డిమాండ్ చేశారు.

ఈ సమస్యను తీవ్రంగా పరిగణించడానికి సిఎం అంగీకరించారు.

- కేంద్రం వాటా నుంచి విద్యుత్ అందించాలని వారు డిమాండ్ చేశారు.

  జూన్ 18, 24 తేదీల నుంచి జూన్ 10వ తేదీకి వరి నాట్లు వేసే తేదీలను ముందుకు మార్చాలని, వరి నాట్లు వేయడానికి కాలువల నీటి సరఫరాను పెంచాలని డిమాండ్ చేశారు.

  అది అంగీకరించబడింది.

- వ్యవసాయ మోటార్ల లోడ్‌లపై ఫీజులను రూ. 4800 నుంచి రూ. 1200/- వరకు పెంచిన దానిని తగ్గించాలన్న డిమాండ్‌ను సీఎం అంగీకరించారు.
- చెరకు రైతులకు క్వింటాలుకు రూ.35 పెండింగ్ బకాయిలను విడుదల చేయడానికి సీఎం అంగీకరించారు.

ఏ ఆందోళననైనా సామూహిక స్థాయిలో ప్రజల్లోకి వెళ్తే, క్రియాశీల ప్రజా భాగస్వామ్యంతో అది తక్షణ మరియు దీర్ఘకాలిక ప్రయోజనాలను పొందగలుగుతుందనే దానికి రుజువుగా పంజాబ్ రైతుల తాజా ఆందోళన ఒక నిదర్శనంగా నిలుస్తుంది. పోరాటాల సంస్కృతికి అలవాటు పడి, మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సాధికార ఉద్యమ అనుభవం పొందిన పంజాబ్ రైతులు, ఈ తాత్కాలిక డిమాండ్లను అతి తక్కువ కాలంలోనే సాధించగలిగారు. వ్యవసాయాన్ని దురాక్రమించకుండా సామ్రాజ్యవాద అనుకూల బహుళజాతి కంపెనీల దోపిడీ విధానాలను నిలువరించడానికి దేశవ్యాప్తంగా ఇటువంటి బృహత్తర పోరాటాలు మరెన్నో జరగాలి.

*****